


రోజూ ఆఫీసుకి వెళుతున్నాను, వస్తున్నాను.

ఆఫీసుకి వెళ్ళగానే నా కొలీగ్సు కనిపిస్తారు. బులుసు వెంకటరావు, నల్లి సత్యం, సింగూ, జోసెఫ్, టైపిస్టు సావిత్రమ్మ, నా స్టెనో రమణియమ్మ, నా అసిస్టెంటు ఖాను.

ఆఫీసు చేరుకోగానే నా రూపం మారిపోతుంది. గుణం మారిపోతుంది. ఒక్కొక్కరితో ఒక్కొక్క విధంగా ఆయాపాత్రలు నిర్వహిస్తాను. నా కొలీగ్స్‌తో సరదాగా కబుర్లు ఆడతాను. నా అసిస్టెంట్లతో అంటీ అంటనట్టుంటాను. నా బాస్‌ని కాకా పడతాను.

జోసెఫ్ నా గదిలోనే కూర్చుంటాడు. అతను ఒక సెక్షన్‌కి ఆఫీసరు. తీరుబాటు కలిగినప్పుడల్లా బైబిలు తెరుస్తాడు. నన్ను క్రిస్టియన్‌గా మారుద్దామని అతడి ప్రయత్నం. ఒక పేజీ దగ్గర తెరిచి, నన్ను చదవ మంటాడు. మనం అంతా పాపులం. పాపులని ఉద్ధరించడానికి ఏసుప్రభువు శిలువ ఎక్కి రక్తం కార్చాడు. మరోసారి ఆ ప్రభువు భూమి మీద అవతరిస్తాడు. ఎప్పుడా? త్వరలోనే. ఆ రోజులు దగ్గర పడ్డాయి.

"నువ్వెన్ని పాపాలు చేశావు జోసెఫ్? ఏవి పాపాలు ఎప్పుడెప్పుడు చేశావు? ఇవాళ ఏ పాపాలు చెయ్య బోతున్నావు?" అని అడిగాను ఒక రోజున. ఏయే హత్యలు చేశావు? ఎన్ని రేప్సు చేశావు? ఎన్ని ఇళ్ళు కాల్చావు? అని మనసులో అనుకుని.

"అబ్బే! నేను ఏ పాపం ఎరగను. నా మనసు ఎంతో నిర్మలమైనది. నేను ఏసుప్రభువుని నమ్మాను. నన్ను ఏ పాపాలూ అంటవు. అన్నీ ఏసు అర్పితం!"

"అయితే మరి పాపు లెవ్వరు?"

"ఏసుని నమ్మని వారు. వారంతా కనిపించినవీ, కనిపించనివీ ఎన్నో పాపాలు చేస్తూనే ఉన్నారు" అని హెచ్చరిస్తాడు. ఇంతలో అతని మొగుడు ( బాస్ ) పిలవగా వెళతాడు.

ఇంతలో 'టీ' కుర్రాడు ఒక కప్పు టీ తెచ్చి నా ముందు ఉంచుతాడు. నా ప్యూను అప్పలస్వామి రోజూ అరగంట లేటుగా సైకిలు తొక్కుకుంటూ వచ్చి, ఆలస్యానికి కారణాలు చెప్తాడు. రోజుకొక కొత్త కారణం చెప్పగల నేర్పు వాడి కుంది. నీళ్ళు తెచ్చి పెట్టి, టేబిలు తుడిచి, పోస్టాఫీసులో పనుందా బజారులో పనుందా, సార్ అని అడుగుతాడు. పని చెప్పగానే ఉడాయించి సాయంత్రం వరకూ మరి తొంగి చూడడు.

ఇంతలో ఒంటిగంట అవగానే ఇంటినుంచి డొక్కులతో తెచ్చుకున్న లంచ్ తింటాం. అదయ్యాక ఒక గంట సేపు రెస్టు. రెండుకి మళ్ళీ పని ఆరంభించి మూడుకి టీ తాగి, నాలుగుకి ఆఫీసు వదిలి ఇళ్ళకి పోతాం.

ఇది రొటీనయి పోయింది. వాడే ఆఫీసరు. వారే కొలీగ్సు. అదే పని. ఇంటికి చేరేసరికి వారే భార్యా పిల్లలూ. పదో తారీఖు వచ్చేసరికి చేతిలోని చిలుము అరిపోవడంతో ఫస్టు ఎప్పుడు వస్తుందాఅని ఎదురు చూడడం. ఫస్టు రావడం, వెళ్ళడం— ఇలా పన్నెండు ఫస్టులు వెళ్ళి ఏడాది గిర్రున తిరిగి పోవడం. దశరాలూ దీపావళులూ, ఉగాదులూ నిమిషాల మీద దొర్లి పోతూ ఉండగా...ఆ మధ్యని భూకంపం వచ్చింది.

ఎప్పుడూ అని నే నడిగితే అదెక్కడ, పదేళ్ళనాటి సంగతి! అని అతడంటే, అబ్బో! పదేళ్ళు గడిచి పోయాయా! మొన్న మొన్ననే కంపెనీలో చేరినట్లుందే అని ఆశ్చర్యపోతాను.

రోజూ ఉదయం ఆరుకల్లా లేవడం, ఒక మైలు కాలినడక నడిచి రావడం, రాగానే నా భార్య ఇచ్చిన కాఫీ తాగడం, గడ్డం గియ్యడం, స్నానంచేసి ఓపిక ఉంటే నవలలో ఒక పేజీ రాయడం. ఇంతలో ఎనిమిదవగా లేచి టిఫిన్ తినడం, బట్టలు మార్చుకుని రోడ్డు మీద పడి బస్‌స్టాండ్‌కి వెళ్ళి నిల్చోడం, సాయంత్రం ఇంటికి రాగానే కాఫీ తాగి, సంచీ పట్టుక మార్కెట్‌కి వెళ్ళడం, కూరల బేరం, పప్పూ ఉప్పుల బేరం. అవి తెచ్చి శ్రీమతికి అప్పగించి వరండాలోకి కుర్చీ లాక్కుని వినామేషాలు లెఖ్ఖ పెడుతూ కూర్చోవడం ఏడు అవగానే తిండి తిని ప్రభో, పత్రికో, నవలో, నాటకమో చదువుతూ నిద్ర పోవడం—ఇదీ జీవితం—ఇలా నడుస్తూ ఉంది.

బస్సులు వేళ తప్పకుండా ఫాక్టరీ ఆఫీసుకి తీసుకు వెళ్ళి, వేళకి తిరిగి తీసుక వచ్చి ఇంటి దగ్గర దింపేస్తాయి. దింపేస్తూ ఇలా అంటాయి: ఇళ్ళకి పోయి స్నానపానాలు కడుక్కుని, విశ్రాంతి తీసుకుని, తిళ్ళు తిని, మీ భార్యలతో సరసపల్లాపము లాడి, నిద్రించి ఉదయమే లేచి, స్నాన ధ్యానంబులం గావించి, భుజించి, తిరిగి తప్పక టయిమ్‌కి రండి మీ. అంత వరకూ గుడ్‌ఈవినింగ్.

రావడం మానకండి! మరలకి మీరు కావాలి. మాకు మీరలు కావాలి.

ఇవాళ ఎన్ని పిడకలు ఉత్పత్తి అయాయి? వెయ్యి పిడకలు ఉత్పత్తి అయాయి. అబ్బే! ఇలా అయితే లాభంలేదు. మన టార్గెట్ ఏడాదికి మిలియన్ పిడకలు! ప్రొడ్యూస్ ఆర్ పెరిష్! అప్పుడప్పుడూ అరుస్తాం. నువ్విచ్చే జీత భత్యాలు చాలవు. కరువు మండిపోతూంది. నువ్వు జీతం ఎక్కువ చెయ్యక పోతే మేం పెరిష్ అవతాం అని. ఏదో పైసాలో పదో వంతు జీతం ఎక్కువ చెయ్యగానే అరవడంమాని పనిలో పడతాము. అరవడమూ రొటీనయి పోయింది.

నా ఆఫీసు గేటు ముందు కూర్చున్న ముసలి చౌకీదారు కునుకుపాట్లు పడుతూ ఉంటాడుఎప్పుడూ. వాడి వయస్సు వాడికే తెలీదు. వాడికి మెట్రిక్ సర్టిఫికేటు అవసరం లేదు. కాబట్టి వయసు తక్కువ ఇచ్చాడు. వాడికి నా తండ్రి వయసుంటుంది. కాని నా వయసు కన్న పదేళ్ళు తక్కువ ఇచ్చాడు. ఆఫీసు జాతకంలో వాడి వయస్సు ముప్ఫయిఅయిదు. వాడిపని ఆ గేటు ముందు కూర్చోడం, కునుకుపాట్లు పడడం. నేను వచ్చేసరికి కళ్ళు కొద్దిగా విప్పుతాడు. ఆ చూపులో నాకు ప్రశ్న కనిపిస్తుంది. "నా చావు ఎప్పుడొస్తుంది సార్? ఎన్నాళ్ళిలా కూర్చోమంటారు కాలాన్ని లెఖ్ఖ పెడుతూ? ఈ కాలం ఒకంతట తిరగకుండా ఉందే? పోనీ నా కన్నా అంతం ఉంటే!"

చావు ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నాడు చౌకీదారు. అలా కునుకుపాట్లు పడుతూ ఏళ్ళూ, పుళ్ళూరాలూ గడిపేస్తున్నాడు.

పోనీ ఇవాళ చావు!

ఎలా చావమంటారు? చావు రానిదే? చావడం అవదు కాబట్టి బతకాలి. బతకాలి కాబట్టి భోజనంచేసి బట్ట కట్టాలి. అందుకు డబ్బు కావాలి. డబ్బుకోసం పనిచెయ్యాలి. పనికోసం ఉద్యోగం. ఉద్యోగంకోసం చదువూ కావాలి. చదువుకోసం స్కూళ్ళు కావాలి. స్కూళ్ళకోసం పిల్లలు కావాలి. పిల్లలకోసం పెళ్ళి చేసుకోవాలి. పెళ్ళికోసం ఆడది కావాలి. ఆడదంటే మాటలా? ఆవిడకి చీరలూ, నగలూకొనాలి.సినిమాలు చూపాలి. గుడ్‌హ్యూమర్‌లో ఉంచాలి. ఈ జీతం రాళ్ళు చాలవు. పక్కదారులు తొక్కాలి. ఎన్నో పాపాలు చెయ్యాలి. పాపాలు పోగొట్టుకుందుకు పూజలు చెయ్యాలి. బతకాలి కాబట్టి ఇవి తప్పవు. ఇవేవీ ఆడ్వెంచర్సు కావు. రొటీను పనులే. చావు ఎప్పుడు వస్తుందా అని చూస్తున్నాం.

ఈ చౌకీదారుమాత్రం అట్టే పాపాలు చేసినట్టు లేదు. కునుకుపాట్లు పడేవాడు ఏం పాపాలు చేస్తాడు పాపం? యౌవన కాలంలో చేసేడేమో? కంట్రీ లిక్కర్ తాగి ఉంటాడు. ఒకటో, అరో అన్యస్త్రీ సంపర్కం ఉండి ఉండవచ్చు. తగువులాట తంటాలూ పడి ఉంటాడు. అదీ రొటీనే. ఆ వయసులో అది మామూలు. ఈ వయసులో ఇది మామూలు. పుట్టేడు కాబట్టి చావలేక, చావుకోసం ఎదురు చూస్తూ కాలం గడపడం.

# మంథా వెంకటరమణారావు

రైలుకోసం వెయిటింగ్ రూమ్‌లో కూర్చుని పూనుపోక పేపరు తిరగవేస్తూ, వేడి వేడి కబుర్లు చదివి కాలాన్ని చంపినట్టు, కాస్త వేడి పనులు చేసి యువ్వనాన్ని చంపేడు. ఇప్పుడు వేడి అయిపోయేక ... ఎప్పటికీ రైలు రాకపోగా, పేపరు పాతపడిపోగా, పేపరు విసిరేసి కునుకుపాట్లు పడుతున్నాడు. నా చావు ఎప్పుడు, సార్? ఆ కళ్ళు నన్ను అడుగుతాయి.

ఈ చౌకీదారుని, ఆఫీసుకొచ్చే కొలీగ్సుని రోజూ చూసి చూసి విసుగు పుడుతుంది. రోజుకొక రకం చీర సింగారించుక వచ్చిన సావిత్రి, రమణియమ్మలు కూడా కొన్నాళ్ళకి మొదట కలిగించిన ఉత్సాహం కలిగించ లేరు నాలో. మోహం మొత్తిపోతుంది.

పోనీ వాళ్ళతో రోమాన్సు ఆరంభిస్తే కొత్తపూను పోతుందేమో అనిపించి, అందులోని కొత్తదనంకోసం ఒకామెను పిలిపించి (నా కొలీగ్ లేనప్పుడు) సరస సంభాషణ ఆరంభిస్తే, ఆ సంభాషణ ఇలా నడుస్తుంది...

ఎలా ఉన్నావ్? బాగానే ఉన్నాను. ఆ చీర ఎక్కడ కొన్నావ్? బాంబే డయింగ్ వాళ్ళ షాప్‌లో కొన్నాను. ఎంతయింది? ఎనభై రూపాయ లయింది.

నువ్వేనయంనాకన్న నలభై పెట్టి ఒకచీర కొనలేక పోతున్నాను నా పెళ్ళానికి అని అనుకుంటాను. జెలసీ కొద్దిగా వస్తుంది. అరె! ఈ జెలసీ ఏమిటి? ఈవిడని పిలిచింది కొత్త ప్రేమ సంభాషణ నడుపుదామనేగా?

చీర చాలా బాగుంది! థాంక్స్! మీకు బాగా నప్పింది.

వెరీ మెనీ థాంక్స్! ముసిముసినవ్వు ... పైట సవరింపు...

ఆడదాన్ని పొగడమని ఎవడో మహానుభావుడు చెప్పేడు. ఎంత పొగడ్తనన్నా హరాయించుకొనే శక్తి వాళ్ళకుందని అన్నాడా రసికారావు. నాకు మాత్రం లేదా ఏమిటి? నేను వేసుకొన్న సరికొత్త బట్టలని ఎవరూ గమనించకపోతే, ఏమర్రా, నాకొత్త బట్టలని ఎవరూ గమనించలేదేం అని హాస్య ధోరణిలో అడుగుతాను. మరి ఆడవాళ్ళు తక్కువ తిన్నారా?

ఈ చీరలో నువ్వు ఇవాళ చాలా అందంగా కనిపిస్తున్నావ్. ముఖం వికసించగా క్రీగంట సరసమైన చూపు విసిరి ... మళ్ళా థాంక్స్! డబ్బారేకుల సుబ్బారావుగారు కూడా అదేమా టన్నారు. ఏమిటేమిటీ! ఆ డబ్బాగాడు అప్పుడే నిన్ను పొగిడి పొంగవేసేసేడా? అయ్యబాబోయ్! నీకు చాలా మంది భక్తులున్నారే? మళ్ళా అమాయ! ఇంకా ఎవరెవరు నీ చీరబాగుందీ, ఈ చీరలో నువ్వు బాగున్నావూ అన్నారు? ఈవిడప్పుడే నా ప్రియమైన ప్రేయురాలయిపోయినట్టూ, నేనే తప్ప మరెవ్వరూ ఆమెని పొగడకూడదన్నట్టూ ఫీలింగు ... వెధవ బుద్ధులు పోయేవి కాదు, ఏళ్ళు పైనపడ్డా. నా శ్రీవారు తప్ప తతిమ్మా అందరూ ఈ చీర బాగుందీ, ఈ చీరలో నువ్వు బాగున్నావూ అన్నారండీ! మీ ఆయన నిన్ను పొగడ్డా? ఆయనకి భయమండీ. ఎందుకట? పొగిడేరంటే మరో చీర కొనేసి డబ్బు తగలేసి ఆయన కిచ్చే డబ్బు తగ్గిస్తానని.

అయితే నా పొగడ్త సముద్రంలో నీటిబొట్టు! మీ ఆయన ఎవడూ? ఫలానా ఆఫీసులో ఫలానా ... అంటే నల్లగా దున్నపోతులా ఉంటాడు. వాడేనా? అవును. నాకు దున్నపోతులంటే ఇష్టం. అలాగా? నేను దున్నపోతునా అని లెఖ్ఖ కడితే కాను అని తేలింది. అందువల్ల నేనంటే ఈమెకి ప్రేమ కలగదని అప్పటి కామెను వదిలిపెట్టేను.

మర్నాడు మళ్ళా పిలిచేను. రోమాన్సంటే ఒక్క రోజులో తేలిపోయే వ్యవహారమా? కోటని ముట్టడి చేసినట్టు చెయ్యాలి—ఆడదాని మనస్సులో పాగా వెయ్యడం ఎప్పటికి జరుగుతుందో ఎవరి కెరుక?

నీ వయస్సెంత? వెధవ ప్రశ్న వేసేనా? ఆడదాని వయసడగొచ్చా అన్న జ్ఞానం లేకపోయింది! ఆ ప్రశ్నకి ఆమె నా వయసు ముప్ఫయి అని అంటే, అబ్బే, నువ్వు పదునెనిమిది సంవత్సరముల కన్యవలె కన్పట్టుచున్నావు అని అందామని. ఆమె ఎదురు ప్రశ్న వేసింది. ఎంత అనుకుంటున్నారు నా వయసు? ఏమో, నాకేం తెలుసు? ఆడదాన్ని చూడగానే దాని వయసు ఇంతా అని తట్టదా? నా టప్పు కనిపెట్టేసింది. నీ వయసు పద్దెనిమిదీ అన్నాను పళ్ళు నములుతూ. ఎగ్జాట్లీ! సరిగ్గా గెస్ చేసేరు అంది. నన్ను థాంక్ చెయ్యలేదు.

మరొకనాడు అడిగేను. మీ కెందరు పిల్లలు? ఆమె నలుగురిా అని అంటే, ఎలా అవుతుంది? మీ వయసు పద్దెనిమిదీ అన్నావు కదా అని పట్టు కుందామని. లేదా, అబ్బే, నీకు పిల్లలున్నట్టే కని పించవూ అందామని. కాని మళ్ళా ఆమె అదే ప్రశ్న వేసింది. ఎందరు పిల్లలున్నట్లు కనిపిస్తున్నాను? చిరునవ్వుతో ఏమాత్రం సిగ్గుపడకుండా, ఎంతో మర్యాదగా, ప్రైవేట్‌గా అడిగింది. వచ్చినట్టు, నీకు పిల్లలింకా లేరు అన్నాను. మరో చిరునవ్వు, నన్ను బోల్తా కొట్టించినందుకు. ఒక్కే ఒక్క మగనలుసు. వాడితో ఆపేసాం అంది నిక్కచ్చిగా. అదిరిపడ్డాను. ఎంత ఫ్రాంక్‌గా చెప్పింది! ఈవిడకో రొమేన్సెలా కుదురుతుంది? శ్రుతి మించితే జోడుతీసి కొడుతుందేమో? సరే ఇంతవరకూ దిగాక ముందుకి వెళ్ళడానికి భయం ఏందుకూ?


ఆపడం అంటే? అంటే మీకు తెలీదా? తెలుసు, కాని టెంపరరీవా, పెర్మనెంటా? నువ్వా ... అతనా? మరో చిరునవ్వు. పెర్మనెంటే ... అతనే చేయించుకున్నారు. డబ్బారేకులు కూడా మీలాగే అడిగేడు. హతోస్మి! ఇంకా ఎంత రడిగేరు? అందరూ అడిగేరు ... కాలిగ్సుంతా ... మీకూ తెల్సునేమో అనుకున్నాను అంటూ, వెర్రి వెధవాయీ, నీ చచ్చు కబుర్లింక అయ్యేయా అంటూ నవ్వి, లేచి వెళ్ళిపోయింది. మరింక రొమేంటిక్ ఐడియాస్ ఇంకిపోయేయి. ఏ దాపరికమూ లేని ఆడవానితో సున్నితమైన వ్యవహారం ఎలా నడపడం? మర్నాడే బజార్న పడతాను!

కాలం చాలా మెల్లగా కదులుతున్నట్టనిపించి ఆవలిస్తాను. కాని కళ్ళు మూసి తెరిచేలోగా రిటైర్మెంటు వయసు దగ్గర పడుతుంది. చిన్నవాడు గడిపిన ఒక్క సంవత్సరం, ఆ అనుభవాలూ ఇప్పటి అయిదు ఏళ్ళకి సమానం. కొత్త అనుభవాలు ఏమీ లేవు. రోజుకీ రోజుకీ భేదం లేదు. వచ్చే ఏడు ఫలానా రోజున ఫలానా టయిముకి నేను ఏంచేస్తానో చెప్పగలను. దానికి వేరే జాతక చక్రం అవసరం లేదు. అంతవరకూ బతుకుతానని నీ కెలా తెలుసూ అంటే, పాపీ చిరాయుః అన్న సామెత గుర్తుచేస్తాను. నా జాతకమే కాదు... నాకు తెలిసిన అందరి జాతకాలూ చక్రం వెయ్యకుండా చెప్పగలను. ఎవ్వరూ ఈ మధ్య చావరు. గుండె నొప్పులు ఎవ్వరికీ రావు. ఆఫీసులో పని ఒత్తిడి లేదు. పంచదార, పాలు, బియ్యం దేశంలోనే పండుకున్నాయి. ఏక్సిడెంట్లు జరగవు. బస్సులలో జాగ్రత్తగా వెళ్ళి వచ్చేస్తున్నారు. ఆఫీసులో కబుర్లతో కాలక్షేపం చేసేస్తున్నారు. టీలూ, కాఫీలూ తాగేస్తున్నారు. ఎవరన్నా ఇప్పిస్తే అల్పాహారాలు సేవిస్తున్నారు. రోజులు గబగబా గడిచిపోతున్నాయి.

ఇంక 'వర్రీస్?' ఎవరికి లేవు కనక? అందరికీ ఉన్నవే. రాజుకీ ఉన్నాయి. మంత్రికీ ఉన్నాయి. ఆఫీసర్‌కీ ఉన్నాయి. గుమాస్తాకీ, ప్యూన్‌కీ కూడా ఉన్నాయి. వర్రీస్ కూడా రొటీన్ అయిపోయేయి. ఎవరికి ఏ వర్రీసు, ఏ క్షణానికుంటాయో రాసి ఇవ్వగలను. ఉదయం లేవగానే పాలవాడు టైముకి పాలుపోస్తాడో లేదో, సకాలంలో తన్మూలంగా కాఫీ దొరుకుతుందో లేదో వర్రీ. బస్సులో చోటు దొరికి, సకాలంలో ఆఫీసుకి చేరుకోగలనో లేనో వర్రీ. ఇవాళ రంగనాయకమ్మ వస్తుందో లేదో వర్రీ. ఇంటికి తిరిగి వచ్చేక రేషన్ షాపు వర్రీ. ఇంటివాడు అద్దె పెంచుతాడేమోనని వర్రీ. బెండకాయలు కిలోకి పావలా పెరుగుతాయని తెలిసి వర్రీ. పిల్లలు పుట్టేక పెంచడం ... స్కూళ్ళల్లోనూ కాలేజీలోనూ సీట్లు ... వాళ్ళ ఆరోగ్యం—ఆడపిల్లలు ఎదిగితే వాళ్ళ పెళ్ళిళ్ళు ... పెళ్ళిళ్ళయేక పండుగులకీ కాన్పులకీ ఇళ్ళకి తేవడాలూ, పంపడాలూ ఇవన్నీ వర్రీసే. ఇవన్నీ అందరికీ ఇంచుమించు ఒకటే. డబ్బు ఉన్నా లేకపోయినా, హోదా, అధికారం ఉన్నవాడికీ ఈ వర్రీసన్నీ తప్పవు. డబ్బున్న వాడు ఎయిర్ కండిషన్డ్ గదిలో కుషన్ల మీద శరీరం వాల్చి వర్రీ అయితే, డబ్బు లేని వాడు పూరి గుడిసెలో నులక మంచం మీద కూర్చొని వర్రీ అవుతాడు. కాని ఒత్తిడి ఇద్దరికీ ఒకటే.

• • • •

ఏమే ... వంటయిందా?




అయింది. స్నానం చేసి రండి ... బంగాళాదుంప వేపుడు మీ కిష్టమని చేసేను.

ఇది బంగాళా దుంప వేపుడా?

అయ్యో! ఏం తింటున్నారో కూడా తెలీదా?

ఏమే ... కొళాయిలో నీళ్ళు రావడం లేదు?

ప్రెషర్ ఎక్కువయినట్టు లేదు. వెళ్తున్నప్పుడే దారిలో కంప్లెయింట్లు రాసి ఇచ్చి వెళ్ళండి. కొంచెం తాపీగా తినండి! మన పిల్లలందరూ పరీక్షలు పాసయ్యేరండీ.

ఎవరు ఏమేం పాసయ్యేరు?

ఎవరు ఏ క్లాస్ చదువుతున్నారో కూడా తెలీదా?

ఇవన్నీ గుర్తుంచుకుందుకి నా కెక్కడ తీరుబాటు?

ఆఫీసు కాగితాలు ఏ వెక్కడున్నాయో మీకు గుర్తుంటుందే? రవి నాలుగు పాసయ్యేడు.

రవి ఎవడు?

అయ్యో రాత! మన నాలుగో వాడండీ! రమ ఎనిమిది పాసయి ...

రమ ఎవరు?

ఏడిపినట్టే ఉంది. అది మన రెండో పిల్ల.

సరి సరి. సాయంత్రం నే వచ్చాక అందరినీ వరసగా నిలబెట్టి, ఎవరు ఏం పాసయ్యారో చెప్పు. ఇప్పుడు తీరుబాటు లేదు.

ఏమిటే ఈ బస్సు ఇంకా రాలేదు? బస్సులు సత్యాగ్రహం చేస్తున్నాయిటండి. ఎందుకు? మనుషుల్ని మొయ్యలేక. గాడిదల్లా వాడుకున్నారట. ఫుట్‌బోర్డు మీద, బోనెట్ మీద, టాపుమీద ఎక్కిపోతే మొయ్యడానికి మేమేం జంతువులమా అని అడుగుతున్నాయి. అవొచ్చే వరకూ ఇవాళటి విశేషాలు చెప్పండి పోనీ.

ఏమున్నాయి? రోజూ ఉన్నవే. కలకత్తాలో ట్రాములు కాల్చారు. ఢిల్లీ దగ్గర రెండు రైళ్ళు గుద్దుకుని వందమంది హరీ మన్నారు. బికానీర్‌లో ఒకామెకి ఎనమండుగురు పుట్టుకొచ్చారు. ఒరిస్సాలో వరదలు, గుజరాత్‌లో అనావృష్టి.

అన్నట్టు మాంధాత చచ్చిపోయాడు. మాంధాత ఎవడు? అయ్యయ్యో! మరిచేపోయారా? మన నాయకులలో అగ్రగణ్యుడు. ఒకనాడు ఏమీ గుర్తు లేదు.

ధరలు కిందటి ఏటికీ ఈ ఏటికీ ఆరవై శాతం పెరిగాయిట. లోటు నింపడానికి కొత్త టాక్సులు ఏం వేద్దామా అని చూస్తున్నారుట. నోట్లు గుద్దితే సరి. అవి గుద్దడం అలా ఉండగా ఏ టాక్సులు పడతాయంటారు? నే అయితే రైళ్ళలో కొత్త తరగతి ప్రవేశ పెడతాను. నిల్చోడం. వాళ్ళకి తక్కువ రేటు. కంపార్టుమెంట్లో సీట్లు ఉండవు. వేశ్యల మీద వృత్తి పన్ను వేస్తాను. పెళ్ళికి లైసెన్సు పెడతాను. ఆ లైసెన్సు ఏటేటా రెన్యువల్ చేసుకోవాలి. పెళ్ళి చేసుకోకుండా ఆడా మగా సంపర్కం పెట్టుకోదలుస్తే ఆ లైసెన్సుకి ఫీజు ఎక్కువ ఉంటుంది. పిల్లడిని కంటే టాక్సు వేస్తాను. కూరల అమ్మకం మీద అమ్మకంపన్ను వేస్తాను". చెప్పుకు పోతున్నాడు డబ్బారేకుల సుబ్బారావు. అందుకే నిన్ను గుమాస్తాగానే ఉంచారు అని అన్నాను. అదుగో బస్సు వచ్చింది.

దిగనీయండి ముందు. తరవాత ఎక్కుదురు కాని.

దిగుతామంటారు కానీ దిగి ఏడవలేం? దించితేనే తప్ప దిగేటట్టు లేదే మీ పరిస? బస్సులో ఎక్కడమే కాని బస్సు దిగడం తెలీదా ఏం మహానుభావా? దిగాలి. దిగాలి. మీ స్టేషన్ వచ్చేసింది. ఎప్పుడూ మీరే ప్రయాణిస్తే మా గతేమిటి? టాపు ఎక్కండి. బస్సు విరుగుతుందయ్యా. ఇంతమందిని మొయ్యలేదు. ఎంతో పోరాడి ఈ రూటుకి బస్సు తెచ్చుకున్నామే— మేం మాత్రం దిగం. జాగా ఉంటే వేలాడండి మీరు.

హల్లో రమణి! హల్లో సావిత్రీ! హల్లో ఎప్రిబడీ. ఏమిటి ఆఫీసు కబుర్లు? ఏముంటాయండీ, మామూలే. ఇవాళ ఉన్న పని ఏమిటి? మామూలే. ముందుగా టీ తాగండి. తరవాత హస్కు వెయ్యండి. ఆనక ఒక సిగరెట్టు వెలిగించండి. అప్పుడు మీ బాస్‌ని తిడుతూ ఫైళ్ళు తిరగేయండి. మీ కింది వాడిమీద ఎగరండి. కాలాన్ని చంపండి. లంచ్ టయమయితే పీక మొయ్యా మెక్కి ఒక గంట కాలం గురకలు తియ్యండి. నాలుగున్నర కల్లా బస్సు ఎక్కండి.

అంతేనా? కొత్త సంగతులేమీ లేవా? అన్నట్టు జోసెఫ్ ఇవాళ రిటైరవతాడు. రిటైరే? అప్పుడే? అప్పుడే అంటారేమండీ, వృద్ధజంబుకం. ముప్పయి ఏళ్ళయింది ఇక్కడికి చేరి.

నే నెప్పుడు రిటైరవతాను? మీరు రేపు రిటైరవతారు! అయ్య బాబోయ్! రేపే! నోనో! ఇట్ కేనాట్ బి!

తమరు పుట్టి 58 సంవత్సరములు గడిచినవి. సార్! అయిదు పుష్కరములు కాలగర్భంలో కలిసినవి. గోదావరి నదిలోని ఇన్ని లక్షల కూసెక్కుల పవిత్ర జలం సాగర గర్భంలో కలిసి పోయింది! తమరు ఇన్ని టన్నుల బియ్యం—ఇన్ని బస్తాల కందిపప్పు, ఇంత పెసర—మినప—ఇతర పప్పులు, ఇన్ని వందల గేలన్ల పాలు,కాఫీ,టీలు, ఇన్ని గేలన్ల స్వదేశీ,విదేశీ పానీయాలూ, ఇన్ని డబ్బాల ఉప్పూ, ఇనుము ఇన్ని వీసెలూ- ఇవన్నీ తిని జీర్ణించుకున్నారు. ఇన్ని రాళ్ళు, ఇంత విసంకరా దా తిన్నారు. ఇన్ని తానుల బట్టలు వాడారు. ఇంత ఆర్జించి ఇంత ఖర్చు చేశారు. ఇన్ని వందల కోళ్ళనీ (గొర్రెల్నీ), కోడిగుడ్లనీ తిని హరాయించు కున్నారు.

ఏమిటయ్యా నేను బకాసురుణ్ణా? లక్షాధికారినా? పూటకి పళ్ళెడు అన్నం, రోజుకి నా మట్టు కొక రూపాయి ఖర్చునూ చేసేవాడినే?


అదంతేనండి. ఇంకా వింటారా? తమరు ఇన్నివేల సిగరెట్లు కాల్చారు. కొన్ని వందల సినిమాలు చూశారు ఇంత దుర్గంధాన్నీ, మలినాన్నీ ప్రపంచంలోకి పంపారు. ఇన్నిసార్లు తగువు లాడారు. ఇన్నిసార్లు పెళ్ళాన్ని కొట్టారు. ఇన్నిసార్లు పైవాళ్ళ చేత దేహశుద్ధి చేయించుకున్నారు. ఇన్ని సార్లు స్త్రీలతో సుఖాలని అనుభవించారు. ఇంతమంది మత్స్యగంధులకి ఇంతింత ముట్ట జెప్పారు. ఇన్ని వాడారు—ఇంటికని చెప్పు కొని. ఇందరు సాధువులని సేవించారు. డాక్టర్ల కింత పోశారు. దేవుళ్ళకి ఇన్ని ముడుపులు చెల్లించి, ఇన్ని వేల టెంకాయలు కొట్టారు. ఇన్ని బుర్రలు మార్చారు. ఇన్ని గ్రంథాలు చదివారు, నడిపించారు. ఇన్ని కోట్ల అబద్ధా లాడారు. ఇన్ని పదుల ఇళ్ళు కట్టారు. ఇన్నివేల ఇళ్ళు కూల్చారు.

ఏమిటీ! ఇదంతా నే చేసినదే! ఒక్క మనిషికి ఇంత సాధ్యమా! రోజూ బస్సులో వెళ్ళి వస్తున్నాను. నా పని నేను చేసుకు పోతున్నాను. ఇంత కాలోజల్ వేస్ట్' చేశానా? ఇన్ని ఘోరాలు ఆచరించానా? నేను నమ్మను. నేను చీమకైనా హాని చెయ్యనే!

అవును ... మీ రన్నది నిజమే. మీరు తల దించుక పోయి ... మీ పని మీరు చేసుకపోయే బాపతు కాబట్టి ఇంత తక్కువ. మీ మీది వారూ ... వారి పైవారూ ... వారి జాబితా వింటారేమిటి?

ఒద్దు! ఇన్ని టన్నుల వాడకం, ఇన్ని లక్షల ఖర్చూ, ఇంత నోటి వాగుడూ, ఇంత సిరా ఖర్చూ, ... వీటన్నిటి తరవాత ఈ నాటికి నాకు మిగిలిందేమిటి? నేను రిటైరయితే నాతో తీసుకు వెళుతున్న దేమన్నా ఉందా? నేను మూట కట్టుకున్న ఆణిముత్యాలేమిటి? నేను సాధించిన పరమార్థ మేమిటి? అదన్నా కొంచెం చెప్పగలవా?

చూడనీండి! చూడనీండి! ఆఁ—ఇదుగో పెద్ద




బండిసున్నా కనిపిస్తోంది, సార్! మీరు సాధించినది ఏమీలేదు... 'నిల్' రిటర్న్స్ మాత్రం!

మరి ఈ బతికిన బతుకంతా వృథాయేనా? గట్టిగా ఏడవడం కాని, గట్టిగా నవ్వడం కాని చెయ్యలేక పోయేనే?

ఇంక మీకు ఏడవడానికి చాలా టయిముందండి. చచ్చేవరకూ ఏడవండి. అనుభవించవలసినప్పుడు అనుభవించలేని కాలం—ఆఫీసులో...రాత్రి నిద్రలో... గడిపేసిన మూడు వంతుల ముప్పాతిక కాలాన్ని తలచుకొని కుళ్ళి కుళ్ళి ఏడవండి!

• • • •

ఎన్ని అనుకున్నాను!

చిన్ననాడు ఎన్ని కలలు! చంద్రమండలంలో దూరి అక్కడేముందో చూడాలి. ఆ దీవపు కొండ వెనుక ఏముందో తెలుసుకోవాలి. ఆ సెలయేటిలో స్నానం చేస్తూ, ఆ నీటి ఒడ్డున మొలిచే గడ్డి పూలని చూస్తూ కాలం గడిపేయాలి. ఆడుతూ, పాడుతూ, నవ్వుతూ, కేరుతూ కాలాన్ని ఖర్చుచెయ్యాలి! ఇవన్నీ కలలు!

కానీ నన్ను బడిలో వేసేరు. నా విలువైన కాలం రోజులు రోజులూ బడిలో నాశన మయింది. ప్రకృతి యొక్క భాష నేర్పలేదు. మనిషియొక్క భాషలు నేర్పేను. అ...ఆ...ఇ...ఈ...ఎ...బి...సి....డి ..ఎఫ్... జడ్—ఎ ఎస్‌ఎస్... ఎస్... గాడిద ... అల ... వల ... తల...కల... మనిషి భాషలు. అలలలో వలలు వన్ని తలని ఉపయోగించి కలలు ... పగటి కలలు కంటూ గాడిదలా బతుకు బరువుని మొయ్య. మనిషి భాషలు నేర్చుకున్నాను. ఆ భాషలో అశ్లీలాలు నేర్చుకున్నాను. అందమైన వాటి అందవికారమైన పేర్లు ... వాటి నానార్థాలు మెదడుకి ఎక్కించేను. భాష సాయంతో అనూయపడడం, ద్వేషించడం, అంతస్తులు సృష్టించడం చేసేను. భాష యొక్క పదజాలంతో మనుష్యులని హిప్నటయిజ్ చేసి నా ఆధీనంలోకి తెచ్చుకుందుకి జీవితమల్లా దండగ చేసేను.

నా జీవిత మనే ఆసలు మదుపుగా పెట్టి లాభాలు తియ్యడం నేర్చుకున్నాను.

ఎక్కడో ఎప్పుడో రాజ్యాలేలిన రాజుల గురించీ, అబద్ధాలాడడంలోనూ, మోసం చెయ్యడంలోనూ, మానవాళిని బాధించడంలోనూ వారి చాతుర్యం గురించీ, వారి శృంగార గాథలు, ప్రేమ కలాపాలు, చేసిన బలాత్కారాల గురించీ, ఘనంగా పొగుడుతూ రాసిన చరిత్రలు చదివి వల్లెవేసి, ఫస్టుమార్కులు తెచ్చుకున్నాను. అంతవాడిని నేనైతే ఎంతబాగుణ్ణు అనుకున్నాను.


అనుకుంటూనే నా పరిధిలో చంగిజుఖాన్‌నీ, తైమూరునీ అయ్యేను. భార్యాపిల్లల్ని ఎక్స్‌ప్లాయిట్ చేసేను. మనస్సులో ఎన్నో బలాత్కారాలు చేసేను. మనస్సంతా విషం నిండింది. మంచీ చెడునీ చూసి నప్పుడు చెడే బాగుందనిపించింది. అటు పాపాత్మణ్ణీ, ఇటు మంచివాడినీ కాలేక, ఎందుకూ ధైర్యంలేక ఒక మరగా మారి అరిగి అరిగి విసిరివేయబడ్డాను.

అందరూ అన్నీ తాగేస్తున్నారు. విస్కీ ... జిన్ ... కంట్రీ లిక్కరు ... కోకో కోలా .., అందమైన సుందరి అధరామృతం ... బలాత్కరిస్తూ అబల అధరాల విషం ... ఆనందంగా తాగేస్తున్నారు. బతుకుని పణంగా పెట్టి జూదం ఆడేస్తున్నారు. పాపాలు మధురంగా, మత్తుగా లేకపోతే ఇవన్నీ ఎందుకు చేస్తున్నారు? నేసుమాత్రం వేమన నీతి శతకాల

వెనక, సుగంతి మంచి మాటల వెనక నక్కి, ముందుకి రాక జంకి, రావాలన్న కోరికని చంపుకోలేక మథనపడి, నా ఇరుసుల గిర్రుగిర్రున తిరిగి అరిగిపోయేను.

కాలేజీల, విశ్వ విద్యాలయంలో నా యవ్వనాన్ని అడవి కాచిన వెన్నెలలా వృథా చేసేను. ఆ హోమ గుండంలో నా ముచ్చటైన జీవితం ఆహుతయి పోయింది. లైబ్రరీలో నోట్సు రాస్తూ, లెక్చర్ హాల్సులో పాఠాలు వింటూ, పనికిరాని గ్రంథాలు తిరగేస్తూ నా మురిపెంపు బతుకులోని సౌత్యం లాంటి భాగాన్ని ధ్వంసం చేసేను. నా రక్తం నామీద తిరగబడితే... నా గుండె నా మీద విప్లవం ప్రకటిస్తే వాటిని అణిచివేసేను. అణగద్రొక్కేను.

అందమైన చిన్నదాని సాహచర్యంలో, ఆమె ఒడిలో తల పెట్టుకొని నక్షత్రాలనీ, చందమామని


ఉద్యోగం — ఫోటో: వి. శశికుమార్

చూస్తూ, ఆమె మత్తయిన చూపులలో సేదదీరుతూ, ఆమె శరీరపు వేడిలో కరిగిపోతూ, ప్రకృతిలో ఒక భాగంగా గడిపేయాలని, ప్రేమలో, కామంలో మునిగి తేలి, యవ్వనాన్ని పండించుకోవాలనీ కలలు కన్నాను.

ఆ రైలు దిగి ఈ రైలు ఎక్కేను. కాని అదే రైలు పెట్టె! క్రిక్కిరిసిన ప్రయాణీకులు. చెమటకంపు... ఫాన్సు తిరగవు. వూపిరి ఆడదు. చెట్లు, పువ్వులు, నదులు, కొండలు పరుగు పరుగునపోతూ ఉంటే ఏమీ చెయ్యలేక రైలు పెట్టెలో కూర్చున్నాను. ఈ చెమట, ఈ ఇరుకు, ఈ చీకటే. ఇదే అందం, ఆనందం అనుకున్నాను.

యూనివర్సిటీ జీవితం గడిచాక, ఆ రైలు దిగాక, రెండో రైలు ఇంకా రాకపోతే, బతికేం ఫో అని చెప్పి, పెట్టెబేడా అక్కడే వదిలి నా సెలయేళ్ళ దగ్గరకీ, పువ్వుల చెంతకీ, ప్రకృతి ఒడిలోకీ పోయి ఉంటే! కాని వెయిటింగ్ రూమ్‌లో దూరాను. ఆ కుర్చీల నల్లులు, గదిలోని దోమలు, అలసిపోయిన ముఖాలు. . .ఫ్లష్ లాగబడని కమోడ్‌లు. . . దుర్గంధం. . .ఇవన్నీ ఆహ్వానిస్తూ ఉంటే నే నెలా పోను? నా రైలు వచ్చి తీరుతుంది. అంతవరకూ కబుర్లు ఆడుతూ గడిపేస్తే సరి. . .

ఏ వూరు వెళతారు? మీ జీతం ఎంత? ఏం పని? పెళ్ళయిందా? ఎందరు పిల్లలు? ఆడా? మగా? ఎందరెందరు. . .? ఇందిరాగాంధి ఇలాగంటూంది. మీ రేమంటారు? మీకెందరు ఎదిగిన పిల్లలు? సంబంధాలు వెతుకుతున్నారా? మీ ఆవు ఈనిందా? మీ భార్య కనబోతుందా? చేటపెయ్యని వెయ్యకుండా చూసుకోండి...

అయ్యో! మీ రైలు వచ్చేసింది, ఎక్కండెక్కండి ఆఖరి క్లాసు పెట్టెలో. , ఎక్కాక మళ్ళా అవే ప్రశ్నలు. . .రోజూ ఎన్నిసార్లు తింటారు? ఏ కూర మీ కిష్టం? అశ్వారావు తీసిన గోహరణం సినిమా చూశారా? అందులో సాండు ఆవుని రేప్ చేసిన సీనుందండీ చూసి తీరాలి! సాండుగా నందీ, ఆవుగా కామధేనువూ వేశాయి. ఫోటోగ్రఫీ అద్భుతం! ఆవుకి పెళ్ళి కాలేదండీ. కన్యండి. ఆవు తొడలు ఎంత షేప్లీగా ఉన్నాయనుకున్నారు! దాని పొదుగుల ఒంపులు. . .బట్టలు లేకుండా నేకెడ్ రేప్, సార్! 'ఎడల్ట్స్ ఓన్లీ' సెక్సురండి. కాని మా పిల్లలంతా చూశారు. సాండు ఆవుని రేప్ చేసిన సీన్ చూసి నప్పుడు కలిగిన ఉద్రేకంలో నా ఉద్రేకాలు కలిపేసి ఆవూ, సాండూ, ఆనక పాడిన డ్యూయట్లు చూసి వింటూ, నా సుందరితో నే గడిపి ఉండే జీవితాని వూహించేసి, అవి విహరించిన ప్రకృతిలో నేనూ విహరించేసనుకొని మంచి సాండు పోటీకివస్తే ఈ ఆబోతు చేసిన కొమ్ము యుద్ధాలా, సాధించిన విజయాలూ నావేనని ఆనందించేసి, కలలోను, సినిమాలలోను, పుస్తకాల సీరియల్సులోను జీవితాన్ని కాల్చేసి, నా రైలు పెట్టెలో, నా సీటు నుంచి కదలకుండా, నాకు తెలీకుండా బతికేసి, సడన్‌గా ముసలివాడినయిపోయి, అందరూ నన్ను ఈడ్చి పారేశాక, పాపకారంగా కూర్చొని ఏడుస్తున్నాను!

దేవుడా! నాకు మరొక్కసారి యవ్వనం ఇయ్యి! నేను తనివి తీరా బతకాలనుకున్న బతుకు ఒక ఏడాది బతికేసి నీ యవ్వనం వాపసిచ్చేస్తాను! అప్పుడు హాయిగా ఏడవకుండా చస్తాను. యయాతిలా కోరికలు నన్ను వదిలిపోలేదు. కాని శరీరం అంతం అవనుంది. ఏం సాధించాను. . .ఎవరికన్నా ఆపగింపయినంత మేలన్నా చేశానా? నాకు నేనన్నా ఆనందం కలిగించుకున్నానా?

ఎన్ని చదివినా, ఎంత తెలుసుకున్నా ఇంకా తెలియని దెంతో ఉండిపోతూనే ఉంది.

శివాజీ గడ్డం పొడుగెంత? అహల్యాబాయి చీర రంగేమిటి? క్లియోపాత్రా వైటల్ స్టేటిస్టిక్స్ ఏమిటి? అక్బర్ తన యవ్వనం నిలుపుకుందుకి ఏ లేహ్యాలు వాడేవాడు? చంగిజ్ ఖాన్ ఎందరు స్త్రీలని చెరపట్టేడు? అశోకుడి గుర్రం ఏ జాతిది? మురా షెడ్యూల్డ్ కాస్టా, షెడ్యూల్డ్ ట్రయిబా? గాంధిగారు తన క్షవరం తనే చేసుకునేవారా? మనిషి బట్టలు ఏం దాచుకుందుకు ధరిస్తాడు? తన శరీరం అంత అందవికారమైనదా? ఖరీదైన బట్టలతో కప్పి కుళ్ళిపోతున్న దేహానికి ఆకర్షణ కలిగిద్దామనా? హెన్రీ ది ఎయిత్‌కి సుఖవ్యాధు లున్నవా లేవా? ఉంటే అవి ఏమిటి? ఆ రక్తాన్నే ప్రజలంతా ప్రశంసించేరా? నాగరికత అంటే ఏమిటి? ఏ చిప్పలలో అన్నం తిన్నారు. . .ఎటువంటి గదులలో. . .ఎటువంటి మంచాల మీద ఎవరితో శయనించారు. . .ఏ కక్కోసులు వాడారు, . .ఏ సెంట్లు పూసుకున్నారు. . .ఏ నాట్యాలు చేశారు... డబ్బు ఎలా కూడ బెట్టేరు. పొరుగువాడి బుర్ర ఎలా కొట్టేరు. ఆ డబ్బు ఎలా ఖర్చు చేశారు. ఇదేనా నాగరికత? సూర్యుడు ఉదయించకపోతే నా నాగరికత ఏమవుతుంది? నా ఆత్మ. . .అది చేరుకునే పరమాత్మ ఏమవుతాయి?

ఇలా తెలియని సంగతులు అనంతంగా ఉండి పోయాయి. ఇవి తెలుసుకొని ఎంత లాభం లేదో. . . తెలియకపోయినా నష్టం లేదు.

కాలం గడిచిపోతూంది గానుగెద్దులాటి బతుకు రొటీన్‌లో. . . .

ఇవాళ ఎన్ని కాగితాలు పుటప్ అయ్యాయి? వందండి, వెరీ గుడ్! ఇంకా ఎన్ని పెండింగున్నాయి? పది, సార్. గుడ్! ఎన్ని రిసీవయ్యాయి? మరో వందండి. దట్సాల్ రైట్! ఇవాళ వోవర్ టైముండి వాటిని క్లియర్ చెయ్యి. నా టయిము వోవర్ అయిపోయింది. సార్! అయిపోతే నీ పెళ్ళాం పిల్లల కోసం దాచిన కాలం ఖర్చు చెయ్యి. టైము నాకు పారితోషికంగా ఇస్తే వోవర్ టైము చెయ్యడానికి నా కభ్యంతరం లేదండీ. నా బ్రతుకు అరవై ఏళ్ళయితే దానికి పదేళ్ళ వోవర్ టైము జోడించి, డెబ్బయి ఏళ్ళు బతికేలా చేస్తారా? నా యవ్వనం ఇరవై ఏళ్ళయితే, రోజుకి నాలుగు గంటల వోవర్ టైము కలిపి యవ్వన కాలాన్ని పొడిగించగలరా? పొడిగించలేను. . . కాని రూపాయలిస్తాను. . . రెండింతలు ఇస్తారు. . .కాని సెకెండు యొక్క విలువ ఎంత? పారిపోయిన నా జీవితపు సెకెండుని పట్టుకొని వెనక్కి తెచ్చి నాకు అప్పచెప్పేస్తే సార్, నేను కొత్తగా పెళ్ళి చేసుకున్న పెళ్ళాన్ని తమ ఆనందం కోసం. . .చ. . .చ. . . అవేం మాటలు? మాటలే కాబట్టి అన్నాను. . అవదు కాబట్టి అన్నాను.

ఎగిరిపోయిన కాలం తిరిగిరాదు. రాదుగాక రాదు. పుట్టుకా చావుల మధ్య అనుభవాలేనీ కాలం. . .నీకెన్ని అనుభవాలయ్యాయి? ఒకే ఒక్క అనుభవముంది... అదే... ఈ ఆఖరు తరగతి రైలు పెట్టె ఎక్కడం... ఆ స్టేషన్లో. . .రైలు ఎక్కకుండా పారిపోయి ఉంటే. . . .

ఎంత మోసం జరిగింది. . . ఈ మిథ్యాబింబాల వెనుక ఎందుకు తీసేను పరుగులు? అనుకున్నట్టు బతకలేకపోయా నెందుకు? జానెడు పొట్ట కోసం జీవితం అంతా మరలో పెట్టి నలిపేశాను. . .

రోజూ చౌకీదారు అడగకుండా అడిగే ప్రశ్నే నా కళ్ళలో అందరికీ ఇప్పుడు కనిపిస్తుంది. . . 'నా చావు ఎప్పుడు, సార్?'' అన్న ప్రశ్న నా కళ్ళలో.

★